


# మారుతల్లి మారుతి

సుశీకి గొప్పింటి పిల్లవని గర్వం లేదు. సాధారణంగా గొప్పింటి వారమ్మాయిలకు గర్వం వుంటూనే వుంటుందంటారు. కాని సుశీకి మాత్రం ఏ మాత్రం గర్వం లేదు. చిన్నప్పటి నుంచి తల్లి లేకపోవడం చేత మారుతల్లి మారుతీదేవి చేతిలోకి సుశీ జారిపోయింది. అప్పటి నుంచి సుశీ ప్రపంచాన్ని గ్రహించగలిగింది. లోకంలో ప్రతి వ్యక్తీ ఆశాసౌధాలు నిర్మిస్తూంటారు. వాటికి అంతూ పొంతూ ఏమీ వుండవు. మనను అన్నింటి కంటే తేలిక గాబట్టి ఆశాసౌధాలు నిర్మించడం అతిశయోక్తి కాదు. సుశీ మానవమాత్రురాలే గనుక తాను గూడా కొన్ని ఆశాసౌధాలు నిర్మించుకుంది.

000

రాయ్‌బహద్దూర్ బలరామ్ గొప్ప జమీందారు. మొదటి భార్య భారతీదేవి మృత్యువు వాత బడింది. అప్పటి నుంచి సుశీ తల్లి లేని బిడ్డైపోయింది. ఆడపిల్లకు తల్లి కరవైతే ప్రపంచంలో ఆ పిల్ల కోరే వస్తువేదీ వుండదంటారు పెద్దలు. మూడు నెలల సుశీని భారతీదేవి ముదుసలి నాగమ్మ చేతిలో పెట్టి పోయింది. నాగమ్మ మూడు నెలల సుశీని ఏడాదిదాన్ని చేసి తానూ దాటిపోయింది. బలరామ్ తల్లి నాగమ్మ మాట వినకుండానే రెండవ పెండ్లికి త్వరపడుతున్నాడు. నాల్గువైపుల బలగం వచ్చి చుట్టుకున్నారు. పేదింటి మారుతీదేవిని పెండ్లి కూతుర్ని చేశారు. మారుతీదేవి బలరాముకు తగిన యువతేనని బంధువులు వివాహం చేశారు. "నలుగురన్నమాట చక్కా నిలిచిపోతుందమ్మా" అని అంటూంటారు. అలాగే మారుతీదేవి జమీందారీ హోదాలో వున్నానని కన్నూమిన్నూ ఏమీ తెలుసుకోకుండా వుంది. 'మధ్య వచ్చినదానికి మహా విరగబా'టన్నట్టు మారుతీదేవి మహా దుడుకుమనిషిగా తయారైంది. ఇరుగింటి వెంకమ్మా, పొరుగింటి పాపమ్మా మారుతి విషయం ఘోరంగా చెప్పుకుంటున్నారు. ఆ మాటలు కూడా పెడచెవిని పెడుతూంది మారుతి.

"ఓ... నా పుట్టింట నేనెంతనుభవించానో... మాకేం?... ఎన్ని యాత్రలు చేశామో?" చెప్పిందే చెప్పుకోడం ఆమెకు పరిపాటి. బలరాం అమాయకుడు. కాబట్టే మారుతీదేవి ఆటలూ, పాటలూ బాగా సాగుతున్నాయి. బలరాముకు ప్రజలు లోబడేవారు కారు. 'తన బొజ్జలో నీళ్లు కదలకుండా వుంటే చాలు' దేశమంతా సుఖంగానే వుందిలే అని బొర్ర నిమురుకుంటాడు. కాని పాపం మారుతీదేవి మాయలు జమీందారు కేమీ తెలియవు. మీసాలు నిమురుకోడం, గోళ్లు పెంచుకోడం తప్ప మరేమీ పట్టవు. అమాయకురాలైన సుశీని బలరామ్ చూస్తూనే వున్నాడు. సుశీ మాటను దూరం చేయాలనుకుంటుంది మారుతి, ఈడొచ్చిన పిల్ల సుశీ కాలేజీకి వెళ్తూంటే "అయ్యో, ఆడపిల్లలు ఎంతలో పెరుగుతారమ్మా! నిన్న మొన్నటి సుశీ ఎంతదైంది!" అని చూచినవాళ్లనుకుంటూండే వారు. సుశీకి నా అనే వాళ్లెవరూ లేరు-పనివాళ్లు తప్ప. ఏ రోజు అన్నం తినకపోయినా "తిన్నావా, తినలేదా?" అని అడిగే దిక్కు కూడా లేదు. కాలేజీలో తప్ప యింటికి రాగానే సుశీకి మనసేమీ బావుండేది కాదు. "ఏదో మనకున్నదాంట్లో కొద్ది భాగం ఇచ్చి నా తమ్ముడు రఘూకు ముడిపెడదాం. సగం చిక్కు తీరినట్టుంటుంది. నా పురుడుకు ముందే మన సుశీకి వివాహం చేద్దాం" అని మారుతీదేవి బలరాంకు బోధ చేయడం మొదలెట్టింది. బలరామ్ ఏ రోజుకా రోజు తల నిమురుకుంటూ ఏవేవో సాకులు చెప్పి తప్పించుకునేవాడు. మారుతి పెత్తనాలు మిన్ను ముడుతున్నాయి. భార్య చేతిలో బలరామ్ కీలుబొమ్మలా తయారయ్యాడు.

బలరామ్ దివాణంలో ఎవరేది చెప్పినా ఊఁ కొట్టి వూరుకుంటాడు. భారతీదేవిని గుర్తు తెచ్చుకొని బలరామ్ బొటబొట కన్నీరు కార్చేవాడు. సుశీ జీవితం ఏ విధంగా వుంటుందోనని ఖేదపడ్తూండేవాడు తండ్రి. మారుతల్లి, మారుతి కేముంటుంది, తన కడుపు నిండితే చాలు, ఎదుటివాళ్లెలాగైనా చావనీ, ఈ మతంలో మారుతి విచ్చలవిడిగా అంతఃపురంలో చెలరేగింది. తన తమ్ముడు రఘుకు సుశీని కట్టి బాగు చేయాలనుకుంది. సుశీని బాధలు పెట్టాలని

తలచింది. భారతీదేవి పోలికలే సుశీనావరించాయి. రఘుకు మారుతి ఏ రోజు వార్త లారోజు అందిస్తూనేవుంది. సుశీ ఇవ్వన్నీ గ్రహించి మారుతీదేవితో పొత్తుమానింది.

000

రఘు ఊళ్లో పేరువడ్డ రౌడీ! ఎదురుపడే ప్రతి వ్యక్తి తలకీ టోపీ తగిలించే రకం, దిట్టమైన వాళ్లెవరైనా తలపడితే వాళ్ల కాళ్లూ, గడ్డాలూ పట్టుకుని బయట పడేవాడు. రఘు పేరుతో దోపిడి ముఠా ఒకటి యేర్పాటైంది. రఘు దురంతాలు ఊరంతా పాకినయ్. బావ ధనంతోపాటు సుశీని కూడా కాజెయ్యాలని ప్రతిజ్ఞ. చదువుసంధ్యలబ్బని రఘుకు విద్యావతియైన సుశీ భార్య అవుతుందా?... కొందరంటారు "ఆ, సింగినాదం. పీటల మీది పెండ్లిండ్లు తప్పిపోవడం లేదూ?" అని. కాని సుశీ, రఘుల విషయం వేరు. సుశీ యిష్టప్రకారమే తండ్రి పెండ్లి ప్రయత్నాలు జరిగితీరాలనుకున్నాడు. అంతటితో మారుతి హృదయంలో రాయిబడ్డట్టయింది. మారుతీదేవి అలక పాన్పు వేసింది. సుశీ దయాహృదయురాలు కాబట్టే మారుతి మంచం దగ్గరకు పోయింది. మారుతీదేవి కొరకొరా చూసింది సుశీని.

సుశీ అందం అంతు లేనిది. మిసమిలాడే పచ్చటి శరీరం. విశాలమైన నొసలు. పెద్ద కండ్లు, నల్లటి వంకులు తిరిగిన వెంట్రుకలు, తీర్చిదిద్దిన ముక్కు. సుశీ చాల గుణవంతురాలని పేరుబడ్డది. సుశీ పనులు మారుతికి నచ్చనే నచ్చవు. ఉన్నవి లేనివన్నీ కల్పించుకుని బలరామ్‌కన్నీ నూరిపోస్తుంది. పరీక్షలన్నీ అయిపోతాయి. కాలేజీ వార్షికోత్సవంలో తానొక అభాగిని పాత్రను తీసుకుంది. దానిలో అభాగినుల జీవితా న్నొకసారి ప్రజల కండ్లకు చూపించాలనుకుంది. మానవుల్లో యీ అభాగినుల కెంత హక్కుందో తెలియపరచాలనుకుంది. మొదటి బహుమతి సుశీదేనని స్నేహితురాండ్రంతా నిర్ణయించారు. కనుకనే తన హృదయాన్ని శ్రీహరి కంకిత మొనర్చినట్లుగా బీచిలో శ్రీహరితో ప్రమాణం చేసింది. ఇద్దరూ ఎవరిండ్లకు వారు చేరారు. శ్రీహరి హృదయంలో జ్యోతి వెలిగింది. సుశీ శరీరంలో అందం రేకెత్తింది.

000

మారుతీదేవి ప్రసవించింది. ఆడపిల్ల. పేరు సుందరి. ఆడపిల్లనగానే బలరాం హృదయంలో నిరుత్సాహం ప్రబలింది. బలరాం నయసు ముదిరిపోయింది. వృద్ధావస్థ ఆసన్నమౌతుంది. ఆడపిల్లనే భగవంతుడు ప్రసాదించాడని చాల విచారించాడు. సుందరిలో అన్నీ మారుతీదేవి పోలికలే వున్నయ్. ఆ రోజు తెలియని రీతిగా కాలేజీపిల్లలు సుశీ స్నేహితురాండ్రూ, స్నేహితులూ సుశీ ఇంటికి విచ్చేశారు. సుశీ అందరికీ చక్కగా మర్యాద చేసింది. లక్ష్మి చాలా పోకిరిది. సినీమాకు వెళ్లందే ఇంటికెళ్లడానికి వీలు లేదంటే వీలు లేదంది. వచ్చినవారిలో శ్రీహరి కూడా వున్నాడు. వీరంతా తెలియనిరీతిగా సినీమాకు బయలుదేరారు. రఘు సుశీని మాయం చేయాలనుకున్నాడు గాని భగవంతుడు ఏదో విధంగా ఇద్దరినీ తప్పించాడు. సుశీ సినీమాకు అందరితోపాటు ప్రయాణమైంది. ఈ విషయం మారుతికి తెలియదు. మారుతీదేవికీ, సుశీకీ మాటలెప్పటి నుంచో వేరయ్యాయి. సుశీ మారుతితో మాట్లాడడమే మానేసింది.

మసకచీకట్లు నాల్గు మూలలా ఆవరించాయి. అపశకునంగా యింటి ముందు పెద్ద కుక్క అరుస్తోంది. పరిచారకులంతా భవనంలో పని చేసి నిద్రచే సొత్తిగిల్లారు. అంతా నిశ్శబ్దంగా వుంది. మిత్రులతో సినీమాకు వెళ్లిన సుశీ యింకా రాలేదు. రఘుకు నిద్ర పట్టడం లేదు. మంచం మీద అటూ యిటూ దొర్లుతూ వున్నాడు. వెంటనే మనసులో సుశీ ప్రత్యక్షమైంది. రఘు లేచి నాల్గు మూలలూ తేరిపార చూశాడు. బలరామ్ పై అంతస్థులో గుర్రుపెట్టి నిద్రిస్తున్నాడు. బలరామ్ గది పక్కనున్న రఘు లేచి మెట్లపై నుంచి కిందికి తొంగి చూచాడు. కింద పిల్లి కూన కూడా మసలడం లేదు. వెంటనే వెనుకకు తిరిగి రఘూ కత్తిన చంకన పెట్టాడు. భయంకరమైన హంతకుడిలా తయారయ్యాడు రఘు. మెల్లగా గదిలో ప్రవేశించాడు. 'రాక్షసి, ఎంత సుకుమారి! పాపం... వయ్యారి నడకలు నడిచి రంభలా నిద్రిస్తోంది. దీని అంతు కనుక్కోవాలి' అనుకున్నాడు. ఆమె పంజరంలో చిలుకలా దుప్పటిలో దూరి నిద్రిస్తోంది. రఘు పక్కనున్న కిటికీలో కాలుంచి కత్తి నెత్తాడు. ఆమెకు మెలకువ లేదు. గాఢనిద్రలో లీనమైవుంది. ఆమె డొక్కలోకి కత్తిని గట్టిగా పొడిచాడు. కలవరపాటుతో ఆమె 'కెవ్వున' కేకవేసింది. గిలగిల తన్నుకుని ప్రాణం వదిలింది. ఆ కేక విని వీరాసామి తలుపులు తోసుకుని పరుగెత్తాడు. వీరాసామిని జూచి రఘు కత్తిని అక్కడే వదలి మేడ పైకి పరుగెత్తాడు. కింద గది అంతా రక్తమయం. భయంకరంగా తయారైంది. పనివాళ్లెవరూ సాహసం చేసి బలరామ్‌కు చెప్పేవాళ్లు లేరు. అంతా భయపడుతున్నారు. రఘు ఎరుగనివానిలా పడుకుని వున్నాడు. పనివాళ్లు గది అంతా మూగారు. ధైర్యవంతుడైన వీరాసామి బలరామ్‌కు చెప్పడానికి మేడ మీదకు పరుగెత్తాడు. బలరామ్ గుర్రు పెట్టి నిద్రిస్తున్నాడు. గట్టిగా లేపి వీరాసామి బలరామ్‌ను కింది గదిలోకి తీసుకుని వచ్చాడు. ఏముంది? అంతా శూన్యం!

ఈ కథను ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక 12.10.1955 సంచికలో ప్రచురించాము

ఈ విషయం ఆ నోటా ఈ నోటా బడి వూరంతా పాక్కింది. జమీందారు గారింట్లో హత్య జరిగిందని, అంతా చూడడానికి ఆ ధాత్రే బయల్దేరారు. హత్య జరిగిన అరగంటకు సినిమా వదిలేశారు. సుశీతోపాటు నలుగురు పిల్లలు సుశీ యింట్లోకి ప్రవేశించారు. తోవలోనే అంతా తెలిసింది. కాని తాను మాత్రం ఏమి చేస్తుంది? రఘు మెల్లగా లేచి అక్క శవాన్ని చూచి చింతించాడు. కాని ఏం చేస్తాడు? సుశీని చూడగానే రఘుకు అరికాలి మంట నెత్తికెక్కింది. బలరామ్ విచారంతో వుయ్యాలలోని పాపను చూచి గుండె బాదుకుంటున్నాడు. చాలామంది చుట్టూ చేరి ఓదారుస్తున్నారు. బలరామ్‌కు హత్య చేసింది రఘు అని తెలుసు. కాని అతన్ని మాట్లాడిస్తే పోట్లాట. మరీ రెట్టిస్తే దెబ్బలాట. పొగరుబోతు, బలరామ్ రహస్యంగా రఘును చూచి పోలీసువాళ్లకు సాక్ష్యం చెప్పమని నూరిపోశాడు. వీరాసామి తల ఎగరవేసి పోలీసులకు వున్నదున్నట్లు తెలియజెప్పాడు. పోలీసులు యింటి చుట్టూ ఎర్రటోపీలతో మూగారు. భవనమంతా బీభత్సంగా తయారైంది. ఉయ్యాలలోని సుందరి కెవ్వుకెవ్వున గోల పెడుతోంది. రఘు చేతులకు పోలీసులు బేడీలు తగిలించారు.

మారుతీదేవి తల్లిదండ్రులు బలరామ్ కాళ్లకు చుట్టుకొన్నారు. వాళ్ల చేతుల్లో పిల్లను పెట్టి బలరామ్ తన భాగంలో కొంత సమర్పించాడు. విషయమంతా ఊరంతా పాక్కింది. 'సుశీ ఎవరితోనో వుండడం చూసి రఘూ సుశీని చంపాలని నిశ్చయించుకొని తెలియక మారుతీదేవిని చంపా'డని సుశీకి విషయం వెంటనే తెలిసింది. తాను వివాహం చేసుకోకుండా వుంటే ప్రమాదమనుకుంది. శ్రీహరి సుశీనెన్నిసార్లో హెచ్చరించినట్లుగా సుశీ ఆత్మ బోధించింది. సుశీకి మారుతీదేవి మరణించినప్పటినుంచి, యింట్లో ఏమీ తోచడం లేదు. బాధ్యతంతా తన నెత్తి మీదనే వున్నట్లుంది. ఏకాకిలా అంతఃపురంలో నిలిచిపోయింది. శ్రావణమాసంలో సుశీకీ, శ్రీహరికీ వివాహం నిశ్చయించారు. శ్రీహరి, సుశీల ఇద్దరూ ఒకరినొకరు చూసుకున్నారు, చిరునవ్వులు కలిశాయి. కనుచూపులు మెరిశాయి.

■